"లేకపోతే మనింట్లోనే మన కళ్ళెదురుగ్గానే ఉండి - శారదమ్మను ఎంత తేలిగ్గా విడిపించుకుపోయాడో చూడు-"

"ఇక్కడే వాళ్ళిద్దరినీ అటకాయించి వాడ్ని చంపిపారేస్తే మన సమస్యలన్నీ పరిష్కారం అయిపోయేవి సార్!"

"కానీ వాడు మురళి అనుకునే గదా మనం వదిలేసింది?"

"అవున్సార్!"

"మరింక ఎలా చంపుతాం?"

"చంపలేమండీ!"

ఇద్దరూ కొద్దిసేపు మళ్ళీ ఆలోచనలో పడ్డారు "మురళి రాధతో వెళ్ళడం తెలీబట్టే వాడు పేపర్లో ఆ ప్రకటన వేసి ఉండాలి - కదూ?"

"అవున్సార్-"

హఠాత్తుగా నరసింహం మెదడులో ఓమెరుపు మెరిసింది "అవునూ - హరికృష్ణ మన దగ్గరున్నాడు! మురళీ రాధతో మరో వూళ్ళో ఉన్నాడు. ఆ సమయంలో మనకి ఫోన్‌చేసి శారదమ్మను విడిపించకపోతే రాధను చంపిపారేస్తానని బెదిరించింది ఎవరు?"

"వాడెవడో మూడోవాడయి ఉండాలండీ-"

నరసింహం మొఖంలోకి కొన్ని లక్షల అనుమానాలు ఒకేసారి జొరబడినట్లు మారిపోయాడు. ఇద్దరే అనుకుంటే మళ్ళీ ఈ మూడోవాడెవడు? మారిపోతోంది.

మూడోవ్యక్తి ఎవరయినా ఉండి ఉంటే....అప్పుడేమిటి చేయటం? వాడినెలా ట్రాప్ చేయటం? వాడిని పట్టుకున్నా చాలు మొత్తం మిస్టరీ అంతా తెలిసిపోతుంది.

"ఒరే రంగా-"

"ఏమిటి సార్?"

"మనం ఇంక ఉపేక్షిస్తే లాభం లేదు. నువ్వు స్వయంగా శారదమ్మ ఇంటికి వెళ్ళి ఆమెను ఫినిష్ చేసి వచ్చేసెయ్. అప్పుడుగానీ మనకు అసలు ప్రమాదం తొలగిపోదు."

"మరి హరికృష్ణ సంగతేం చేద్దామండీ!"

"వాడివల్ల మనకు వ్యక్తిగతంగా ముప్పు ఉంటుంది గానీ, చట్టరీత్యా కాదు-"

"అవున్సార్!"

"వెంటనే వెళ్ళు - ఇంక ఆలస్యం చేయకు - పని పూర్తవగానే నాకు ఫోన్ చెయ్-"

"సరే సార్-"

రంగా వెళ్ళిపోయాడు.

మరి కాసేపట్లో ఫోన్ మోగటం ప్రారంభించింది. పరుగుతో వెళ్ళి ఫోన్ అందుకున్నాడు నరసింహం.

"హలో..." అన్నాడు ఆత్రుతగా.

“హలో నరసింహం! రాత్రి బాగా నిద్రపట్టిందా?”

“నీ తెలివితేటలు ఎంతోకాలం గెలవలేవు-”

“నేనూ ఎంతోకాలం గెలిపించాలనుకోవటంలేదు. అందుకే ఆఖరి అవకాశం ఇద్దామని పిలిచాను-”

“ఏమిటిది?”

“మా ఆస్తిని నాకు వెంటనే కాష్ రూపంలో అప్పజెప్పాలి.”

“మీ ఆస్తి నా దగ్గరేమీలేదని చెప్పానుకదా-”

“అయితే ప్రతిరోజూ ఇలా నీ కూతుర్ని నేను తీసుకుపోవటం, ఇంట్లో నిద్రపట్టక ఫోన్ దగ్గర కూర్చుని ఉండటం ఇవన్నీ జీవితమంతా అలాగే ఉన్నా ఫరవాలేదంటావా?”

“చెప్పానుకదా! నీ తెలివితేటలు నన్నిప్పుడు మోసం చేయలేవు - ఒకసారంటే ఇలా జరిగింది. ఈసారి ఏం ఎత్తు వేస్తావో చూస్తాను-”

“ఇప్పటికప్పుడే ఓ చచ్చుతెలివి ఉపయోగించావ్ - నీ తెలివి ఎప్పుడూ ఇలాగే అఘోరిస్తుంది-”

“ఏం చేశావిప్పుడు?”

“మా అమ్మని చంపమని ఆ రంగాగాడిని పంపించావ్! ఆ రంగాగాడొక ఇంటర్నేషనల్ ఇడియట్! నీకు బుర్ర లేదనుకుంటే వాడికి అంతకన్నాలేదు - మా అమ్మను ఇంకా అదే ఇంట్లో ఉంచానని మీ ఇద్దరూ భ్రమపడుతున్నారంటే మీరు ఎంత మానసిక సంక్షోభంలో ఉన్నారో తెలుస్తోంది-”

“శారదమ్మ ఆ ఇంట్లో లేదా?”

“ఎందుకుంటుంది? నీలాంటి చచ్చువెధవలు ఎలాగూ చంపేది అలాంటి ముసలమ్మలనేనని నాకు తెలుసు - అందుకే మార్చేశాను ఆ ఇల్లు-”

“నేను మూలనున్న ముసలమ్మలను చంపుతానో, మీసాలు దువ్వే మగాళ్ళను చంపుతానో ఓసారి ఎదుటికొచ్చి చూడకూడదూ?”

“ఏడ్చావ్‌లే - రోజంతా మీ ఇంట్లోనే నీ పక్కనే ఉన్నాకూడా ఏమీ చేయలేక పోయారు. మీ రామలింగం వూరునుంచి ఎవరు ఫోన్ చేశారో ఇప్పటివరకూ తెలుసుకోలేకపోయారు. ఇక నీ అల్లుడంటవా - వాడు నా సోదరుడు అని చెప్పుకోవటానికి సిగ్గుగా ఉంది......పిరికి సన్నాసి......పెళ్ళాం పక్కలో పడుకోవటం తప్ప మరేం తెలీదు వాడికి. కేవలం మరదలు వరసవుతుందని రాధని ఇప్పటివరకూ ముద్దు వరకూ వచ్చి వదిలిపెట్టాను. ఇక నా తరువాతి స్టెప్పు నీకు ఇప్పుడే అర్థమైందనుకుంటాను-”

నరసింహం మొఖానికి పట్టిన చెమటలు తుడుచుకున్నాడు “ఇంతకూ ఇప్పుడు దేనికి ఫోన్ చేశావ్?”

“అయిదు లక్షలు క్యాష్ కావాలి.”

"నా దగ్గరెక్కడిది?"

"మా ఆస్తి తాలూకూ డబ్బు నీ దగ్గరే ఉంది-"

"నా దగ్గర లేదని చెప్పాను కదా!"

"ఉందని నేను చెప్తున్నాను-"

"ఇస్తే ఏం జరుగుతుంది?"

"వెరీగుడ్! అలా అడుగు! ఇస్తే నీకూ నాకూ మధ్య ఈ గొడవలుండవ్! నువ్ పిచ్చెక్కి-ఎవడు మురళీ? ఎవడు హరికృష్ణ? అంటూ జుట్టు పీక్కోడాలూ, ఆ రంగాగాడికి వాడి గాంగ్‌కి ఫీజు - ఇవేమీ ఉండవ్! నువ్వు నీ అల్లుడు, కూతురుతో సుఖంగా ప్రశాంతంగా జీవితం గడుపుతావ్- ఇంకో విషయం చెప్పనా - తనతో నా సరసం ఎక్కడివరకూ వచ్చి ఆగిందో - సిగ్గుతో నీ కూతురు పూర్తిగా చెప్పలేకపోతోంది. నీ అల్లుడు అది 'పూర్తిగా' పూర్తయిందన్న భ్రమతో మనసు పాడుచేసుకుని పిచ్చివాడవుతున్నాడు. పాపం నీ కూతురికి చెప్పుకో - సిగ్గువిడిచి
భర్తతో - తను పూర్తిగా పాడవలేదని చెప్పమని! లేకపోతే ఈ కమ్యూనికేషన్ గ్యాప్ నీ అల్లుడిని మానసికంగా చంపేస్తుంది"

నరసింహం మాట్లాడలేదు. కూతురికి ఏమీ జరగలేదన్న సంతోషం- ముందు ముందు జరగబోతుందన్న భయం.....వాడడిగిన అయిదు లక్షలూ వాడికి పారెయ్యడానికి తనకేమీ అభ్యంతరం లేదు. కానీ తను హరికృష్ణ గురించి భయపడుతున్న కారణం వేరు. వాడి తండ్రిని చంపి, వాడిని చంపబోయినందుకు ప్రతీకారం తీర్చుకోవడానికే ఇదంతా చేస్తున్నాడని భయపడుతూ వచ్చాడు. నిజంగా అయిదు లక్షలే అయితే -

"మాట్లాడవేమిటి? అక్రమంగా సంపాదించిన మా ఆస్తి వదులుకోడానికి ఇబ్బందిగా ఉందా?"

"సరే - ఇస్తాను-"

"గుడ్! ఇప్పుడిప్పుడే చేసిన పాపాలకు పశ్చాత్తాపం కలుగుతోన్నట్లుంది. మనిషికి పశ్చాత్తాపాన్ని మించిన శిక్ష లేదని మన శాస్త్రాలు చెప్తున్నాయ్."

"అధిక ప్రసంగం చేయకు!-"

"సరే - అయితే చాలా క్లుప్తంగా మాట్లాడతాను! డబ్బు ఎప్పుడు, ఎక్కడ, ఎలా ఇద్దామనుకుంటున్నావ్?"

"నువ్వే చెప్పు-"

"సినిమాల్లోలాగా బ్రీఫ్‌కేస్‌లో పెట్టి ఊరి బయట పాడుబడిన గుడిదగ్గర అయితే బావుంటుందనుకుంటున్నావ్ కదూ? అలా అయితే దొంగచాటుగా నన్ను కాల్చి పారేసి నీ డబ్బు నువ్ తీసుకెళ్ళిపోవచ్చని నీ కోరిక! కదూ?"

"మరెలా ఇమ్మంటే అలాగే ఇస్తానని చెప్తాను-"

“ఇవాళ పదివేల మొత్తం చొప్పున సెల్ఫ్ చెక్‌లు తయారుచేసి వాటిని కవర్లోపెట్టి రడీగా ఉండు! సాయంత్రం అయిదింటికి మీ ఇంటికి ఓ అడుక్కునే కుర్రాడొస్తాడు. వాడికిచ్చేసెయ్. వాడు నాకు తెచ్చిస్తాడు. ఒకవేళ ఎవరయినా వాడిని ఫాలో అయారో శవాలు కూడా దొరకవు మీవి! తరువాత నన్ను నిందిస్తే లాభంలేదు-”

“సరే-”

## 19

అరగంటలో చెక్కులన్నీ రడీ చేశాడు నరసింహం. సాయంత్రం వరకూ ఆ కుర్రాడి కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు.

మరికాసేపట్లో రంగా నిరాశతో తిరిగి వచ్చాడు.

“ఆ ముసల్ది మహా తెలివిగలది సార్! ఇల్లు మార్చేసిందట తెల్లారుజామునే”.

“నాకూ తెలిసింది.”

“ఎవరు చెప్పారు?”

“వాడే - హరికృష్ణ-”

“వాడినెలా ట్రాప్ చేయాలో నాకే మాత్రం తెలీటంలేద్సార్-”

రంగాకు తను హరికృష్ణకు అయిదు లక్షలు ఇస్తున్న విషయం చెప్పదల్చుకోలేదు నరసింహం. తెలిస్తే రంగా ఇవ్వనీడు. అందులో ఓ లక్ష తనకిస్తే తనే హరికృష్ణ పట్టుకుని చంపిపారేస్తానని పేచీ పెడతాడు.

సరిగ్గా అయిదవుతోండగా గేటు దగ్గరకొచ్చి నిలబడ్డాడో కుర్రాడు “బాబుగారూ ధర్మం చేయండి బాబూ! పైసలో, కవర్లో ఏదోటి దానం చేయండి బాబూ-” అంటూ గట్టిగా అరచాడు.

ఘూర్ఖా వాడిని తరిమి కొట్టబోయాడు గానీ నరసింహం గట్టిగా అరిచాడు, వాడిని లోపలకు రానివ్వమని.

కుర్రాడు ఆనందంగా లోపలికొచ్చాడు.

నరసింహం తన జేబులో నుంచి కవరు తీసి కుర్రాడి కిచ్చాడు. వాడది జేబులో పెట్టుకుని బయటకు నడిచాడు.

“అదేమిటి సార్ -వాడికి కవర్ ఇచ్చారేమిటి?” ఆశ్చర్యంగా అడిగాడు రంగా.

“ఇవ్వాల్సి వచ్చింది.”

“ఎందుకు సార్ - ఎవరికిచ్చారు? అందులో ఏముంది?”

“చెక్కులు-”

“చెక్కులు ఆ ముష్టివాడి కిచ్చారా?”

“అవును!”

“ఎందుకు?”

“వాటిని తీసుకెళ్ళి వాడు హరికృష్ణకిస్తాడు-”

"హరికృష్ణకా?" ఉలిక్కిపడుతూ అడిగాడు.

"అవును-"

"వాడికి చెక్కులెందుకిచ్చినట్లు?"

"అయిదు లక్షలుఇస్తే వాడు ఇక మన జోలికిరానని ప్రామిస్ చేశాడు."

"అయ్యో - కొంప ముంచారు గద్సార్-"

"ఎందుకు?"

"హరికృష్ణ అనే వాడెవరూ లేరండీ - మీకు ఫోన్ చేసి డబ్బు కాజేసిన వాడు ఇంకెవడైనా అయుండొచ్చుగానీ, హరికృష్ణ మాత్రం కాదు.......నన్ను క్షమించండి....."

"..........."

"అవున్సార్ - వాడు ఆ రోజే ఆ చెరువులో మీరూ, నేనూ కాల్చిన పిస్టల్ గుళ్ళకి చచ్చిపోయాడు-"

నరసింహం మతిపోయినట్లయింది.

"చచ్చిపోయాడా?"

"అవునండీ! శవాన్ని నేనే పాతిపెట్టాను."

"మరి ఆ మధ్య అడుగుతేనేమో వాడు చావలేదనీ, ఊరికే నన్ను మభ్యపెట్టడం కోసం వాడిని పాతి పెట్టినట్లు చెప్పాననీ అన్నావ్ గుర్తుందా?"

"అబద్దం చెప్పానండీ.."

"అబద్ధం చెప్పావా?"

"అవునండీ-"

"ఎందుకు?"

"ఏదో - మళ్ళీ నాలుగు డబ్బులొస్తాయ్ గదాని....."

నరసింహం కోపంగా రంగా చొక్కా పట్టుకున్నాడు.

"ఎంత ద్రోహం చేశావ్‌రా! డబ్బు కోసం కక్కుర్తిపడి - నాకే అబద్ధాలు చెప్తావా?"

"జరిగిందేదో జరిగిపోయింది సార్! ముందు వాడెవడో ఆ అయిదు లక్షలు తీసుకోకుండా చూడాలి మనం-"

నరసింహం చకచక ఆలోచించాడు.

"వాడికీపాటికి చెక్కులు అంది ఉంటాయ్. వెంటనే బాంక్ వెళ్ళి మేనేజర్‌కి చెప్పాలి! ఆ చెక్కులు ప్రెజెంట్ చేసిన వారిని పోలీసులకి పట్టివ్వాలని-"

"పద త్వరగా బాంక్‌కు వెళదాం-" అన్నాడు నరసింహం.

ఇద్దరూ బాంక్‌కి చేరుకున్నారు కార్లో. కారు బయట పార్క్ చేసి బాంక్ మేనేజర్ రూమ్‌లోకి పరుగెత్తాడు నరసింహం.